
ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 18 నవంబరు, 2026 | పేజీలు : 08

487 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా లబ్ధిదారులకు ప్రత్యేక శిబిరాలు



19వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు
కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రజాపక్షం/హనుమకొండ : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో లబ్ధిదారుల నమోదు కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇతర అధికారులతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 19వ తేదీ నుంచి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నందున జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. రేషన్ కార్డు ఉన్నా, లేకున్నా ఈ పథకానికి అర్హులేనని పేర్కొన్నారు. పథకంపై అవగాహన కల్పించడంలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఆయా రేషన్ దుకాణాల పరిధిలోని లబ్ధిదారులందరీ చేత బీమా పథకానికి దరఖాస్తు చేయించేలా ప్రణాళికతో అధికారులు ముందుకెళ్లాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని, ఇందుకోసం అనువైన ప్రదేశాన్ని గుర్తించి అవసరమైన టెంట్లు, కుర్చీలు, ఫ్లెక్సీలు, డేటా ఎంట్రీ కోసం కంప్యూటర్, ప్రింటర్, తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కుటుంబాన్ని పోషించే యజమాని పేరిట బీమా దరఖాస్తు చేసుకునేందుకు 1859 ఏళ్లలోపు వారందరూ ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఫలితంగా నంపాదించే వ్యక్తి అకస్మాత్తుగా మృతి చెందిన సందర్భంలో ఆయా కుటుంబాలు ఇబ్బంది పడకుండా బీమా కంపెనీల సహకారంతో ప్రభుత్వం రూ.5 లక్షలను ఇస్తుండడంతో ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, స్థానిక సంస్థల ఇన్ఛార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్డీవో మేన శ్రీను, సీపీవో సత్య నారాయణ రెడ్డి, కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఈడీఎం శ్రీధర్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి

సిఎం సహాయనిధి అండ



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజాపక్షం/భూపాలపల్లి: పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం మంజూరు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 50 మంది లబ్ధిదారులకు రూ.21 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వైద్య చికిత్సల కోసం సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టుకోలేని పేదలకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగాన్ని అన్ని విధాలుగా బలోపేతం చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ యంత్రాలు, వెంటిలేటర్ల ఏర్పాటు, వైద్యులు, సాంకేతిక సిబ్బంది నియామకాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వైద్య సేవలు కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు కూడా ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, పట్టణ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్థిక వేధింపులే దంపతుల

ఆత్మహత్యకు కారణమా?

నాలుగు పేజీల సూసైడ్ నోట్..మహిళపై ఆరోపణలు



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: రంగశాయిపేటలో దంపతుల ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. నల్లపోగుల శోభ, సంజయ్ మృతికి ఆర్థిక లావాదేవీల వివాదాలే కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతికి ముందు దంపతులు నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం. వడ్డీ వ్యాపారం, డబ్బుల లావాదేవీల విషయంలో దివ్య టైలర్ పేరుతో ఉన్న మహిళ తమను వేధించినట్లు లేఖలో ఆరోపించినట్లు తెలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, వేధింపులే తమ మరణానికి కారణమని పేర్కొన్నట్లు సమాచారం.

విచారణలో తేలాల్సిన నిజాలు: సూసైడ్ నోట్‌లోని ఆరోపణలపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది. ఆర్థిక లావాదేవీల్లో వివాదాలు, దంపతులపై జరిగినట్లు చెబుతున్న వేధింపులు, ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరపాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తులోనే ఈ ఘటన వెనుక వాస్తవాలు వెల్లడికానున్నాయి.

సిఎం సిద్దిపేట పర్యటన

విజయవంతం చేయాలి

హెలిప్యాడ్, పాదయాత్ర, బహిరంగ వేదిక స్థలాలను పరిశీలించిన కలెక్టర్, సిపి హైమావతి

ప్రజాపక్షం/ సిద్దిపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దిపేట పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మి పెరుమాళ్ తో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లా కేంద్రానికి హెలికాప్టర్ లో చేరుకొని నిర్దేశించిన ప్రాంతం నుండి సభాస్థలి వరకు పాదయాత్ర నిర్వహించి ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఇందిరమ్మ చీరల పంపిణీ, మరియు ఇందిరమ్మ కుటుంబబీమా పథకాలను ప్రారంభించి భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని ఇందుకు వివిధ శాఖలకు కేటాయించిన పనులను సమన్వయంతో నిర్వహించి ఎలాంటి లోటు పాట్లు లేకుండా సభ విజయవంతం అయ్యేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజా రాణి, సిద్దిపేట హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, అధికారులు, పోలీస్ అధికారులుపాల్గొన్నారు.

కొడకండ్లలో నేడు రిలే నిరాహార దీక్ష

ప్రజాపక్షం/కొడకండ్ల: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నవంబర్ 18న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రిలే నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు గ్రామ ఉప సర్పంచ్ మహ్మద్ షన్నా ఒక ప్రకటనలో తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కొడకండ్లలో నిర్మించాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష నిర్వహించడం జరుగుతుందని కావున గ్రామ ప్రజలు, పెద్దలు పార్టీలకతీతంగా దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాళేశ్వరం ఆలయంలో కార్తీక శోభ

ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ఆలయంలో కార్తీకమాసం సంధర్భంగా నిత్యం భక్తుల తాకిడి పెరిగి కార్తీక శోభ సంతరించుకుంటుంది.వివిధ సుదూర ప్రాంతాల నుండి వేకువ జాము నుండే క్షేత్రానికి తరలి వచ్చిన భక్తజనంతో సందడిగా మారుతుండగా కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. త్రివేణి సంగమ గోదావరి నదిలో తొలుత పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తీరం వద్ద ఇసుకతో ఏర్పాటు చేసిన సైకత లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం నదీ తీరంలో కార్తీక దీపాలు వెలిగించి గోదారమ్మ నదిమాతల్లి ఒడిలో వదిలి పెడుతున్నారు.అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శించుకుని భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. సాయంకాల సంధ్యా వేళలో భక్తులు ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకృతులలో సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తుండటంతో ఆలయ పరిసరాలు కార్తీక శోభ సంతరించుకుంటుంది.

ఎదిరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పివి టీకా కార్యక్రమం

ప్రజాపక్షం/వెంకటాపురం(నూగురు): మండలంలోని ఎదిరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఏటురునాగారం ఐటిడిఏ పిఓ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ సందర్భంగా ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో తల్లితండ్రుల ఆధ్వర్యంలో హెచ్‌పివి టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల లోపు పిల్లలకు కాన్సర్ టీకా గురించి అవగాహన కల్పించి టీకా ప్రయోజనాలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యయులు హెచ్‌ఎమ్ సోమల నాయక్, ఎఎన్ఎమ్ వినోద, సుశీల, సరస్వతి,ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది, వార్డెన్ ఎట్టి బాబురావు, నాగరాజు, ఆనంద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అంగోతు సుగుణ

ప్రాజాపక్షం/కాటారం: కాంగ్రేస్‌పార్టీ సీనియర్ నాయకురాలు అంగోతు సుగుణ కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా మరోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భాగా కాంగ్రేస్ పార్టీ నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా డిసిసి జనరల్ సెక్రెటరీ కుంభం స్వప్న రెడ్డి ఆమెకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కుంభం స్వప్న రెడ్డి మాట్లాడుతూ కాంగ్రేస్ పార్టీ బలోపేతానికి అంగోతు సుగుణ చేస్తున్న సేవలు పార్టీపట్ల అమెకున్న నిబద్ధత అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, స్వప్న, భాగ్యలక్ష్మి, సుజాత, ఏలుబాక, జిల్లా మహిళా కార్యదర్శి పాల్గొన్నారు.

కార్తీక మాసం ఆధ్యాత్మిక వైభవం!

ప్రజాపక్షం/నెక్కొండ: హరిహరుల ఆరాధనలో భక్తి భావం.. తులసి పూజ లు, బిల్వార్చనలు, అయ్యప్ప దీక్షలతో ఆధ్యాత్మిక సందడి కార్తీక మాసం అంటే కేవలం పూజలు, వ్రతాలకే పరిమితం కాదు.. మనసును శుద్ధి చేసుకుంటూ భక్తి మార్గంలో పయనించే పవిత్ర సమయం. హరిహరులకు అత్యంత ప్రీతికరమైన ఈ మాసంలో శివకేశవుల ఆరాధనకు భక్తులు విశేష ప్రాధాన్యత ఇస్తున్నారు. తెల్లవారుజామునే దీపారాధనలు, తులసి కోట వద్ద పూజలు, శివాలయాల్లో బిల్వార్చనలు, ఆకాశదీపాలు, అఖండ దీపాలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. మరోవైపు అయ్యప్ప స్వామి మాలధారణతో భక్తులు నలభై ఒక్క రోజుల మండల దీక్షకు సిద్ధమవుతున్నారు. నియమ నిష్ఠలు, ఉపవాసం, బ్రహ్మచర్యం, ఇంద్రియ నిగ్రహంతో స్వామి సన్నిధికి చేరాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. కులమతాలకు అతీతంగా భక్తి ఐక్యత, ఆత్మనిగ్రహం, సేవాభావాన్ని చాటిచెప్పే కార్తీక మాసం..ప్రతి ఇంటా వెలిగే చిన్న జ్యోతి నుండి భక్తుల హృదయాల్లో వెలిగే ఆధ్యాత్మిక జ్యోతి వరకు ప్రత్యేకతను చాటుతోంది.

డిసెంబర్ 09న ఘనంగా అయ్యప్పస్వామి పంబారట్



ప్రజాపక్షం/నర్సంపేట: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఆదేశాల మేరకు, బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 9న నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయం నందు పంబారట్, మహా అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నర్సంపేటలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటి బాధ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యక్రమ ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, అన్నదాన నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా స్వప్న సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ దివంగత నేత, మాజీ శాసనసభ్యులు స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట పట్టణంలోని శ్రీ అయ్యప్ప ఆలయంలో జరిగే పంబారట్ కార్యక్రమానికి గత 25 సంవత్సరాలుగా మహా అన్నదాతగా వ్యవహరిస్తూ, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రారంభించిన ఈ సేవా సంప్రదాయాన్ని తమ కుటుంబం నేటికీ కొనసాగిస్తోందని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఏటా వేలాది మంది అయ్యప్ప భక్తులకు, భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ కమిటి బాధ్యులు, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ, మండల, పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపినగౌడ సంఘం నాయకులు



ప్రజాపక్షం/నర్సంపేట: నర్సంపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డిని గౌడ సంఘం నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలలో ఇంత పెద్ద ఎత్తున గీత కార్మికుల పెన్షన్లు రావడం ఇదే మొదటి సారి అని గతంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 50 ఏళ్లకే గీత కార్మికులకు పెన్షన్ పథకాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని తద్వారా నేటికి కొనసాగుతూ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున గీత కార్మికులకు పెన్షన్లు అవకాశం కల్పించినందుకు నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు కోల వెంకటేశ్వర్లు గౌడ్ ,కార్యదర్శి మద్దెల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి గిరి గాని కిరణ్ గౌడ్, బొట్టు పెద్దమనుషులు కొయ్యడి కిరణ్ గౌడ్, గిరిగాని మొగిలి గౌడ్, పిసిసి సభ్యులు పెండెం రామానంద్, డిసిసి ఉపాధ్యక్షులు వేముల సాంబయ్య గౌడ్, పట్టణ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్, పట్టణ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, 29 డివిజన్ కార్యదర్శి దొమ్మడి కుమారస్వామి గౌడ్, మాజీ గౌడ సంఘం అధ్యక్షులు వేముల ఆయిల్ సాంబయ్య గౌడ్, చుక్క కనకయ్య గౌడ్, పుల్లూరు రవీందర్ గౌడ్, గండు స్వామి గౌడ్, మాజీ వార్డు మెంబర్లు గండి యాదగిరి గౌడ్, రామగోని సుధాకర్ గౌడ్, కోయడి సంపత్ గౌడ్, ఇతర గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏజెంట్ల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి ఐక్యతే ప్రధానమని లియాఖీ 1964 వరంగల్ డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ గౌడ్ అన్నారు. కొమ్మాల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద వరంగల్2 బ్రాంచ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ అధ్యక్షుడు ఆకుల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పులి సుధాకర్ గౌడ్, కోశాధికారి ప్రభాకర్ ముఖ్య అతిథులుగా, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ పి హనుమంతు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ ఏజెంట్ల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఏజెంట్లంతా ఐక్యంగా పనిచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. మేనేజర్ హనుమంతు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎల్ఐసీ సేవలను ప్రజల్లోకి విస్తరించాలని సూచించారు. నూతన అధ్యక్షుడు ఆకుల కుమారస్వామి, కార్యదర్శి దురిశెట్టి సంతోష్ కుమార్, కోశాధికారి దోలి కోటేశ్వర్ ఏజెంట్ల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను నియామక పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ఖానాపురం: మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి సహకారంతో పిఏసిఎస్ చైర్మన్ వల్లే శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదురు కుమారస్వామి, ఉప సర్పంచ్ కొనుకటి రాజు, యువజన అధ్యక్షుడు నవీన్, లెంకలపల్లి రవి, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ రోల్ అబ్జర్వర్‌కు కమిషనర్ వెంకన్న స్వాగతం

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) రోల్ అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి దాసరి హరిచందనను జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్న మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హన్మకొండలోని హరిత హోటల్‌లో ఆమెకు పూల మొక్క అందజేసి సాదరంగా స్వాగతం పలికారు.

నేరాల నియంత్రణపై నిరంతర నిఘా ఉంచాలి: డిఎస్‌పి

ప్రజాపక్షం/మహాదేవపూర్: నేరాల నియంత్రణకు నిరంతర నిఘా ఉంచాలని కాటారం డిఎస్పీ సూర్యనారాయణ అన్నారు.మంగళవారం మండలకేంద్రంలోని పోలీస్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు, క్రైమ్ రికార్డులు,కేసు డైరీలు,పెండింగ్ కేసుల వివరాలు పరిశీలించారు. అనంతరం పోలీస్టేషన్ పరిసరాలు సబ్బంది పని తీరు,కేసుల దర్యాప్తు పురోగతి,నేర నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డిఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ,పెండింగ్ కేసులను త్వరితగతిన పరిశ్కరించాలని సూచించారు. సైబర్ నేరాలు, గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు. పోలీస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను చట్టపరిధిలో పరిశ్కరించాలని,ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు,ఎస్సై సాంబ మూర్తి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాపక్షం/మంగపేట: మండలంలో కోమటిపెల్లి గ్రామ పంచాయతీ శివారు పోచమ్మగూడెం (గుత్తికొయ గూడెం) లో సైబర్ నేరాలపై పై అవేర్నస్ కార్యక్రమం గూడెం ప్రజలకు స్థానిక ఎస్ఐ బి.మధుకర్ అధ్యర్యంలో పోలీస్ శాఖ తరుపున అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలు పాఠశాల కి పంపాలి కూలి పనులు పంప వద్దు బాల్య వివాహాలు చేయరాదు. పంపితే చట్టరీత్యా నేరం అని అనంతరం గుత్తికొయ గూడెం చిన్న పిల్లలకు బిస్కెట్ లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రెండవ ఎస్ఐ ఎల్ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువజన ఉత్సవాల్లో చిట్యాల విద్యార్థినుల సత్తా

ప్రజాపక్షం/చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. కళాశాలలో బైపిసి ప్రథమ సంవత్సరం చదువుతున్న అవంచ వైష్ణవి డ్రాయింగ్ పోటీలో ప్రథమ బహుమతి సాధించింది. నృత్య పోటీల్లో తిప్పని అంజలి బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ఎంఎల్‌పి గంద్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి శ్రీదేవి విద్యార్థినులను అభినందించారు. యువజన ఉత్సవాలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుక దోహదపడతాయని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం యుగంధర్, వేముల రాజు, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

ఆపదలో కార్యకర్త కుటుంబానికి నాగరమేష్ అండ



ప్రజాపక్షం/గోవిందరావుపేట: కష్టాల్లో ఉన్న పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచి బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేష్ మానవత్వాన్ని చాటు కున్నారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నడవ లేని స్థితిలో మంచానికే పరిమితమైన పసర గ్రామా నికి చెందిన బండి సాయికుమార్ కు వీల్‌చైర్ అంద జేసి బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు గోవిందరావుపేట మండలం పసర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బండి మోహన్ కుమా రుడు సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు ఈ ప్రమాదంలో వెన్ను ముక విరగడంతో నడవలేని పరిస్థితి ఏర్పడి మంచా నికే పరిమితమయ్యాడు బాధిత కుటుంబ పరిస్థితిని స్థానిక పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బాడిశ నాగరమేష్ వెంటనే స్పందించి జిల్లా అధ్య క్షుడు కాకులమర్రి లక్ష్మ ణ్ బాబు తో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు తనవంతు సహా యంగా వీల్‌చైర్‌ను అందించేందుకు ముందుకొచ్చి జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మ ణ్‌బాబు చేతుల మీదుగా బాధితుకి అందజేశారు కష్టకాలంలో కార్యకర్త కుటుంబానికి అండగా నిలవడం ద్వారా నాగరమేష్ పలువురి ప్రశంసలు అందుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రదీప్‌రావు, తాటికృష్ణ ,జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి ,మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహానా యక్ ,మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ వెలిశాల స్వరూప, పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

బాలల దినోత్సవంలో న్యాయ విజ్ఞాన సదస్సు



ప్రజాపక్షం/ములుగుః జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు ములుగు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాయినిగూడెంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలుర)లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ మాట్లాడుతూ డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలకార్మిక నిషేధ చట్టం, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంపై విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోతు స్వామిదాస్, ప్రధానోపాధ్యాయులు పి సంపత్, ఏ సాంబయ్య, పి రామ్‌కుమార్, ఎం కనన్ సింగ్, వి నారాయణ, ఎన్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

136 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్లు



ప్రజాపక్షం/లింగాలఘణపూర్: నెల్లుట్ల గ్రామపంచాయతీ ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో 136 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లను మంజూరు చేసిన పత్రాలను సర్పంచ్ నర్సింగ రామ కృష్ణ ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందనితెలిపారు. సమాజంలో ఆర్థికంగా వర్గాలకు, వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధాప్యంలో ఉన్నవారికి, జీవనోపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక భరోసా అని అన్నారు. ప్రతి నెలా అందే పింఛన్ ద్వారా లబ్ధిదారులు తమనిత్యావసర, అవసరాలను తీర్చుకోవడంతో పాటు గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించేందుకు తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. నెల్లుట్ల ఒకేసారి 136 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లు మంజూరు చేయడం సంతోషకరమైన విషయమని సర్పంచ్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు, అందించేందుకునిరంతరంకృషి, చేస్తున్నామని, ప్రజల అవసరాలను గుర్తించివారిసమ స్యల పరిష్కారానికి, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చి నహామీలను, ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, పేదలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద కుటుం బాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్ వార్డ్ మెంబర్స్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, నూతన పింఛన్ల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫామ్ పాండ్ భూమిని పరిశీలన



ప్రజాపక్షం/వేలేరు : సెప్టెంబర్ 2న ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన ఫామ్ పాండ్ చేసిన భూమి ఎవరిది ?అనే వార్తా కథనంపై శాలపల్లి గ్రామసర్పంచ్ కూరపాటి అశోక్ స్పందించారు.గ్రామస్తుల నుంచి వచ్చిన సందేహాల నేపథ్యంలో మంగళవారం కొందరు గ్రామస్తులతో కలిసి ఫామ్ పాండ్ నిర్మించిన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఫామ్ పాండ్ నిర్మించిన భూమి గ్రామానికి చెందిన వ్యక్తి పట్టా భూమా.?ప్రభుత్వ భూమా.?లేక దళితులకు సంబంధించిన భూమా.?అనే సందేహాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతు న్నాయి.2024,2025 సంవత్సరాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో పథకం అమలులో అవకతవకలు జరిగినట్లు ప్రస్తావించినప్పటికీ,ఫామ్ పాండ్ నిర్మించినభూమి యాజమాన్యానికి సంబంధించిన వివరాలు స్పష్టంగా వెల్లడి కాలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.ఈనేప థ్యంలో ఫామ్ పాండ్ నిర్మాణానికి ఎంపిక చేసిన భూమి ఎవరి యాజమాన్యంలో ఉంది.?రెవెన్యూ రికార్డులలో ఆభూమి ఏవిధంగా నమోదైంది .? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సంబందిత రెవెన్యూ, ఉపాధి హామీశాఖ అధికారులు భూమి రికార్డు లను క్షణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడిం చాలని గ్రామస్తులు కోరుతున్నారు.ప్రజాపక్షం వార్తా కథనానికి స్పందించిన సర్పంచ్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం గ్రామంలో ప్రధాన్యత సంతరించు కుంది .అయితే ఫామ్ పాండ్ నిర్మించిన భూమి యాజ మాన్యంపై నెలకొన్న సందేహాలకు అధికారుల విచారణ తోనైనా స్పష్టత వస్తుందా.?అన్నది వేచి చూడాలి.

జియాకోమో ఫిలిబెక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ప్రజాపక్షం/భూపాలపల్లి: హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై విదేశీ ప్రతినిధి జియాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. భారత రాజ్యాంగ వ్యవస్థ, ప్రజాస్వామ్య ప్రక్రియలను ప్రశ్నించేలా వ్యాఖ్యలు చేయడం దేశ గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని పేర్కొంటూ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిషీధర్ రెడ్డి మాట్లాడుతూ, భారత్ సమ్మిట్ నిర్వాహకుల పాత్రపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం, చట్టాలకు ఎవరూ అతీతులు కారని, దేశ గౌరవం, ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరుకల గణపతి, రాష్ట్ర నాయకులు బట్టు రవి, దుప్పటి భద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, తాడికొండ రవికిరణ్, వట్టెం తిరుపతితో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొలిపే శక్తి కవులు, రచయితలదే



ప్రజాపక్షం/భూపాలపల్లి: సమాజంలో చైతన్యం తీసుకురావడంలో కవులు, రచయితల పాత్ర ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి లలిత అన్నారు. కవులు, రచయితలు తమ కలం ద్వారా సమాజాన్ని మేల్కొలిపే రచనలు చేయాలని పిలుపునిచ్చారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి లలిత జ్యోతి ప్రజ్వలన చేసి కవి సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మార్పు, చైతన్యం తీసుకురావాలంటే కవులు, రచయితల సృజనాత్మక రచనలు ఎంతో అవసరమన్నారు. వారి రచనలు ప్రజలను ఆలోచింపజేసేలా, సమాజంలోని సమస్యలపై అవగాహన కల్పించేలా ఉండాలని సూచించారు. కవి సమ్మేళనంలో పాల్గొని తమ కవితా గానంతో అలరించిన కవులు, రచయితలను అభినందించారు. గ్రంథాలయాలతో కవులు, రచయితలు తమ అనుబంధాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి డి.రాజేంద్రప్రసాద్, కుసుమ కృష్ణమోహన్,కవులు గడ్డం లక్ష్మయ్య, కామిడి సతీష్ రెడ్డి, దుప్పటి మురళి, నల్గొండ సురేష్, ఆకారపు భుజేందర్ కోలుగురి సంజీవ రావు, గడ్డం రమేష్ చంద్ర, లైబ్రేరియన్లు కృష్ణ, శారద, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లోని కెజిబివిలో షీ టీమ్ అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కె.జి.బి.వి.)లో సోమవారం షీ టీమ్ అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ షీ టీమ్ ఎస్.ఐ. స్వాతి మరియు ఆమె బృందం ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినుల భద్రత, ఆత్మరక్షణ, మంచి స్పర్శ చెడు స్పర్శ, మొబైల్ ఫోన్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చైల్డ్ హెల్ప్ లైన్ వినియోగం తదితర అంశాలపై వారు వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కె.జి.బి.వి. జఫర్‌గఢ్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు. అవగాహన కల్పించిన షీ టీమ్ సభ్యులకు, ఎస్.ఐ. స్వాతి కి పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బి.నవీన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాపక్షం/బచ్చన్నపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో విషాధం నింపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం బచ్చన్నపేటకు చెందిన తేలుకంటి భరత్ (27) ఈనెల 4వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై బచ్చన్నపేట నుంచి జనగామ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో కుక్క అడ్డుగా రావడంతో వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో భరత్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో మంగళవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి తల్లి, సోదరుడు ఉన్నారు. భరత్ మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఎమ్మెల్యే పరామర్శ...:భరత్ మృతి విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అంత్యక్రియల ఖర్చులను తాను భరిస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ హాస్పటల్‌లో రోగులకు నాణ్యమైన ఆహారం సరఫరాలకు ఈ టెండర్ల ఆహ్వానం

ప్రజాపక్షం/జనగామ: జనగామ ప్రభుత్వ జనరల్ హాస్పటల్, ఎంసి హెచ్, క్రిటికల్ కేర్ బ్లాక్‌లలో ఆహారం సరఫరాకు ఈ టెండర్లు పిలవడం జరిగిందని జిల్లా ఉపాధి శాఖ అధికారి కుమారస్వామి తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. జిల్లా డైట్ మేనేజ్‌మెంట్ కమిటి ఆధ్వర్యంలో తెలంగాణ ఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ ఓపెన్ టెండర్లు, రెండు కవర్ల విధానంలో బిడ్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ టెండర్ల ద్వారా జనగామ ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌లో 134 పడకలు, చంపక్‌హిల్స్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 196 పడకలు, క్రిటికల్ కేర్‌లో 50 పడకలు కలిసి 380 పడకలకు ఆహారం సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. గతేడాది డైట్ సరఫరా రిజిస్టర ప్రకారం సంవత్సరానికి సాధారణ డైట్లు లక్షా 58వేల 114 కాగా చికిత్సా, అధిక ప్రోటీన్ డైట్లు 23వేల 518, డ్యూటీ వైద్యుల డైట్లు 7వేల 300 చొప్పున మొత్తం లక్షా 88వేల 932 డైట్లు అవసరం అయ్యాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం డైట్ రోజుకు 8 రూపాయల అధిక ప్రోటీన్ డైట్ 160 రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఎంపికైన సంస్థ 1 డిసెంబర్ 2026 నుండి రేండేళ్ల పాటు ఒప్పందంతో పనిచేయనున్నారు. టెండర్ డ్యూక్యుమెంట్లు ఈ నెల 16వ తేదీని సాయంత్రం 6 గంటలకు ఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో డైన్‌లోడ్ చేసుకోవచ్చునని, ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటల వరకు జనరల్ హాస్పటల్ ప్రిబెడ్ సమావేశం నిర్వహించి పరిశీలిండం జరుగుతుందన్నారు.

కడియం శ్రీహరికి ఘన స్వాగతం

ప్రజాపక్షం/జనగామ టౌన్: అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘన స్వాగతం పలికారు. టీపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్, డీసీసీ జిల్లా కార్యదర్శి జమాల్ షరీఫ్, అడ్వకేట్ గద్దె అనిల్ కుమార్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి ఆయన నాయకత్వం దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.

మంత్రి సీతక్క చేతుల మీదుగా నేడు నూతన పెన్షన్ల పంపిణీ



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : సంగెం, గీసుగొండ మండలాల పరిధిలోని స్టేషన్ చింతలపల్లి వద్ద ఉన్న కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ పైలాన్ ప్రాంతంలో బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) చేతుల మీదుగా నూతనంగా మంజూరైన చేయూత ఆసరా పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యే నూతన పెన్షన్ లబ్ధిదారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వెంకటేశ్వర్లపల్లిలో ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాపక్షం/నడికూడ: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో ఐకెపి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ మందోటి రాజు,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పర్నెం మల్లారెడ్డి. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఈర్ల చిన్ని, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు పెద్దబోయిన రవీందర్, ప్రధాన కార్యదర్శి మంత్రి లింగమూర్తి, గ్రామ కార్యదర్శి మౌనిక, గ్రామశాఖ ప్రధాన కార్యదర్శులు పెండ్యాల విక్రమ్ రెడ్డి. ఎండీ రజాక్ సీనియర్ నాయకులు చెరుకుపల్లి సమ్మిరెడ్డి గ్రామ రైతులు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ఆవుల సుమలతకు పిహెచ్‌డి పట్టా ప్రదానం

ప్రజాపక్షం/వరంగల్ టౌన్: వరంగల్ నగరంలోని ఎల్లంబజార్‌కు చెందిన ఆవుల సుమలత విద్యారంగంలో విశేష ఘనత సాధించారు. చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్సలర్ సీహెచ్‌వీ పురుషోత్తం రెడ్డి చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఎక్స్‌ప్లానేషన్ ఆఫ్ మెషిన్ లర్నింగ్ మెథడ్స్ పర్ ప్రిడిక్షన్ ఆఫ్ అగ్రికల్చర్ సాయిల్ ప్రాపర్టీస్ అనే అంశంపై ఆమె పరిశోధన నిర్వహించారు. డాక్టర్ జి. మాధవి పర్యవేక్షణలో ఈ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేశారు. కంప్యూటర్ సైన్స్ పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసే ఈ పరిశోధన ప్రాధాన్యత సంతరించుకుంది.వరంగల్ నగరానికి చెందిన ఆవుల సుమలత పీహెచ్‌డీ పట్టా సాధించడంతో స్థానికంగా హర్షం వ్యక్తమైంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆమెను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కబ్జాదారుల చేతిలో ప్రభుత్వ భూమి



విలువ కోటి...ప్రజావాణిలో ఫిర్యాదు

ప్రజాపక్షం/శాయంపేట: హన్మకొండ జిల్లా శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో ప్రభుత్వ భూమి రక్షణ లేకుండా పోయింది. సర్వే నంబర్ 138లో నేరేడు పల్లి రోడ్డు సమీపంలో ఉన్న 38 గుంటల ప్రభుత్వ భూమిపై గతంలో ఆక్రమణ యత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణల తో ఈ భూమికి అధికారులు కంచె నిర్మాణం చేసారు. ఈ భూమి విలువ సుమారు సుమారు కోటి రూపాయలు ఉంటుందని గ్రామానికి చెందిన పోతు రమణారెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో కొందరు వ్యక్తులు గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా ఈ స్థలంలో ఇళ్లు నిర్మించారని, అప్పటి సర్పంచ్ పోతు సుమలత ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్పట్లో అక్రమ నిర్మాణాలను తొలగించి క్రీడా ప్రాంగణం బోర్డు సైతం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆ బోర్డులను తొలగించి, స్థలాన్ని చదును చేస్తూ కొత్త ఇళ్ల నిర్మాణాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మరోవైపు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని ప్రస్తుత సర్పంచ్ జేసీబీతో పూర్తిగా తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని, రూ.80 లక్షల విలువైన ప్రజా ఆస్తిని కాపాడాలని రమణారెడ్డి కోరారు.

ఉర్దూ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం



ప్రజాపక్షం/వరంగల్ టౌన్: జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉర్దూ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో ఎల్‌బీ నగర్‌లోని గోల్డెన్ గెస్ట్ హౌస్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పత్రికా స్వేచ్ఛ, పాత్రికేయ నైతిక విలువలు, ఉర్దూ భాష పరిరక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల బాధ్యతలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత లేబర్ ఆఫీసర్ మహమ్మద్ హబీబుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అక్బర్ జియా మాట్లాడుతూ, 1966 నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటైన సందర్భంగా జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథి మహమ్మద్ హబీబుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ ట్రాన్స్‌లేటర్ పోస్టులను భర్తీ చేయడం, ఉర్దూ పాఠశాలలను అభివృద్ధి చేయడం, ప్రభుత్వ కార్యాలయాల సైన్‌బోర్డులపై ఉర్దూ భాషకు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేయాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ జాఫర్ ,హాఫిజ్ మహమ్మద్ ఫజల్ ఉర్ రెహమాన్ ,మహమ్మద్ హుస్సేన్ పాషా,అఖ్తర్ హుస్సేన్ అఖ్తర్,అసోసియేషన్ కార్యదర్శి ఇస్మాయిల్ జబీహుల్లా తదితరులు మాట్లాడారు. సమావేశం ముగింపులో పత్రికా రంగ ప్రాథమిక విలువలు, నిజాయితీ, నిష్పక్షపాత వైఖరి, ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం, ఉర్దూ భాష అభివృద్ధి, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు.

22 నుండి తెలంగాణ ఉద్యమకారుల మహా పాదయాత్ర

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ప్రత్యేక తెలంగాణ ఉద్యమ జ్వాల ఎలా రగిలిందో, ఆ ఉద్యమానికి ఊపిరి పోసింది ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. సకల జనుల సమ్మెతో, విద్యార్థుల ఆత్మబలిదానాలతో, ఉద్యోగుల పోరాటంతో, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల కదం తొక్కడంతో తెలంగాణ ఉద్యమ జ్వాల రగిలింది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉద్యమకారులు నాడు వీధుల్లోకి వచ్చి కొట్లాడితేనే నేడు ప్రత్యేక తెలంగాణ వచ్చింది. కానీ ఆ ఉద్యమానికి ఊపిరి పోసిన ఉద్యమకారులకు ప్రత్యేక రాష్ట్రంలో దక్కాల్సిన గౌరవం దక్కలేదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హన్మకొండ నయీమ్ నగర్ లోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ తమ్మల శోభారాణి చేపట్టనున్న పాదయాత్ర కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులంతా ఈ పాదయాత్రలో పాల్గొని ఈ పాదయాత్ర విజయవంతం చేయాలని వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. వరంగల్ పోచం మైదాన్ రాణి రుద్రమదేవి విగ్రహం నుండి హైదరాబాద్ లోని అమరవీరుల స్మారక భవనం వరకు సాగే ఈ పాదయాత్రకు బీసీ సంక్షేమ సంఘం పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో తెలంగాణా ఉద్యమ కారులు నారెల్ల విజయ, కొడపాక అన్నపూర్ణ, గిరిబోయిన రాధిక, ఇంజె భావన, జూపక ఇందిరా, ప్రమాదదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్ భూ వివాదానికి

బీఆర్ఎస్ నాయకులే కారణం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

ప్రజాపక్షం/హనుమకొండ: కాజీపేట వైఎస్సార్ నగర్ భూములు, కాజీపేట చౌరస్తాలో నిర్మాణం చేపట్టిన భవనానికి సంబంధించిన అంశాల పై ఇటీవల బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో పాటు కొన్ని హైదరాబాద్‌కు చెందిన యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఆరోపణల పై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం కాజీపేటలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ నగర్ గుడిసెవాసుల సమస్యపై గతంలోనే సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించానని, మరింత సమగ్ర సమాచారం కోసం మరోసారి దరఖాస్తు చేశానని తెలిపారు. రెవెన్యూ, కుడా, మున్సిపల్ కార్పొరేషన్ తదితర మూడు శాఖల నుంచి పూర్తి డాక్యుమెంటేషన్ సేకరించిన తర్వాతే ప్రజల ముందుకు వాస్తవాలు తీసుకువస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్ నగర్ భూములకు సంబంధించి ఇరానీ కుటుంబానికి చెందిన భూములు అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలోకి రావడంతో అప్పట్లో కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఈ కేసు న్యాయపరిధిలో ఉండగానే 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, అప్పటి ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో, సదరు భూములను నాలా కన్వర్షన్ చేసి ఇరానీ కుటుంబ సభ్యుల పేర్ల పై ఎలా నమోదు చేశారనే అంశం పై ప్రశ్నించారు. 2018 వరకు సీలింగ్ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములు 2019లో ఏ విధంగా మార్పులకు గురయ్యాయో అధికారిక పహాణీలు, ఇతర రికార్డులతో సహా మీడియా ముందు ఉంచినట్లు తెలిపారు.వైఎస్సార్ నగర్ భూములు, కాజీపేట చౌరస్తా భవన నిర్మాణానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆధారాలతో ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ రాజాలి, తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, అబూబకర్, గుంటి కుమార్, సీనియర్ నాయకులు అంకుష్, సమత రాజు, పల్లకొండ సతీష్, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

20న బికెఎంయూ జిల్లా సమావేశం

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్: హనుమకొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఈ నెల 20న మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు సిపిఐ కార్యాలయం బాలసముద్రంలో జరుగుతుందని బికెఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి సమావేశానికి బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు తాటి పాముల వెంకట్ రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి హాజరవుతున్నారని తెలిపారు. సభ్యత్వంతో పాటు బికెఎం యు రాష్ట్ర మహాసభలు కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో జరుగ నున్నందున ఈ మీటింగ్ కు చాలా ప్రాధాన్యత ఉందిని కావున ఆఫీస్ బేరర్స్ సమయాన్ని పాటించి ఈ మీటింగ్ కు సకాలంలో హాజరై విజయవంతం చేయగలరని కర్రె లక్ష్మణ్ కోరారు.

తాళ్ళ రవికి ఐకానిక్ ఎక్సలెన్స్ అవార్డు



ప్రజాపక్షం/నడికూడ: శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ ఐకానిక్ ఎక్సెలెన్స్ అవార్డు 2026 అందుకున్న తాళ్ళ రవి ముదిరాజ్ కు హైదరాబాద్ లో నిర్వహించిన మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా తాళ్ళ రవి ముదిరాజ్ కు సత్కారం సమాజహితమే ధ్యేయంగా నిత్యం ప్రజల గొంతుకై నిలబడుతూ,నిజాలను నిర్భయంగా వెలికితీస్తున్న జర్నలిజం రంగానికి మరో అరుదైన గౌరవం లభించింది. మనం ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా తాళ్ళ రవి ముదిరాజ్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు,సామాజిక కార్యకర్తలు,పలువురు పాల్గొని తాళ్ళ రవి ముదిరాజ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ ఎన్.శ్వేత



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ గారు మంగళవారం నాడు మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను, పెండింగ్ కేసుల వివరాలను, కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణను సమీక్షించి పలు సూచనలు చేశారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలనిసిబ్బందికి సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పోలీస్ సిబ్బందికి సీపీ సూచించారు.ఈ తనిఖీలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పర్వతగిరి సీఐ ఆర్.సంతోష్ కుమార్, మామునూరు ఇన్‌స్పెక్టర్ ఈ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్‌గా సంజయ్



ప్రజాపక్షం/వెంకటాపూర్: జవహర్ బాల్ మంచ్ ములుగు జిల్లా చైర్మన్‌గా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామానికి చెందిన కామ సంజయ్ పటేల్ .సోమవారం నియమిస్తూ జోహార్ బాల్ మంచ్ జాతీయ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ చైర్మన్ డాక్టర్ జివి హరిజి. తెలంగాణ జాతీయ సమన్వయకర్త ఇంచార్జ్ డాక్టర్ శమ్యూల్ జార్జ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రుషికేశ్ రెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ బొక్క ప్రమోద్ ఉత్తర్వులు జారీచేసి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కామ సంజయ్ పటేల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన జాతీయ రాష్ట్ర జవహర్ బాల్ మంచ్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెంచిన పన్నులు తగ్గించే వరకు పోరాటం



ప్రజాపక్షం/ములుగుః మున్సిపాలిటీలో పెంచిన ఇంటి, వాణిజ్య పన్నులను వెంటనే తగ్గించాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూల్ల వీరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. పన్నుల పెంపును నిరసిస్తూ బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్ష మంగళవారం ముగిసింది. రెండవ రోజు దీక్షకు ఆయనతో పాటు ఎంఎల్‌పి చిన్మయిల్ అంజిరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ మౌళిక సదుపాయాలు కల్పించకుండానే ప్రజలపై 800 శాతం వరకు పన్నుల భారం మోపడం అన్యాయమన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. పన్నులు తగ్గించే వరకు బిజెపి పోరాటం కొనసాగుతుందన్నారు.

బైలా సవరణ కమిటీకి సూచనలు అందించిన ప్రెస్ క్లబ్ బాధ్యులు

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బైలాస్ సవరణ కమిటీ కన్వీనర్ పీవీ మదన్మోహన్, సభ్యులు వల్లాల వెంకటరమణ, బొక్క దయాసాగర్, సంగోజు రవి, కక్కర్ల అనిల్ కుమార్,తడక రాజనారాయణ, కంకణాల సంతోష్‌లకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ నిర్వహణ, ఎన్నికలు, తదితర పరిపాలన అంశాలపై గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీకి దృష్టికి వచ్చిన పలు సలహాలు సూచనలను లేఖ రూపంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి అమర్‌లు అందజేశారు.బైలా సవరణ కమిటీకి పలు విషయాల్లో కూలంకశంగా పొందుపరచాల్సిందిగా విన్నవించారు. కమిటీ నివేదిక ఈనెల 25 లోగా అందించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తాం

ప్రజాపక్షం/నర్సంపేట: నర్సంపేట పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సిసి రోడ్డు పనుల నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో నర్సంపేట పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. పట్టణంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలకంటి విజయ్ కుమార్, సలావుద్దీన్ అయూబ్ ఖాన్, శ్రీరామోజు రోజా రాణి, మున్సిపల్ సిబ్బంది బొల్లెపెల్లి శ్రావణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ములుకల మనీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మేరబోయిన ప్రేమ్ కృష్ణ, మచ్చకంటి మనోజ్ కుమార్, పాల్గొన్నారు.

సాగంటిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లోగో ఆవిష్కరణ

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : సాగంటిస్ ఆర్ట్స్ అకాడమీ అండ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ గుర్తింపు పొందిన సాగంటిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లోగోను ఈరోజు హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా సాగంటిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ అడ్జుడికేటర్ డాక్టర్ మంజుల సాగంటి మాట్లాడుతూ.. కళా, సామాజిక, విద్యా, క్రీడా మరియు వివిధ రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి, వారి ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉన్నత లక్ష్యంతో ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సంస్థ ఆధ్వర్యంలో రాబోయే నవంబర్ 29వ తేదీన హనుమకొండ వేదికగా మాసివ్ అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్ ఫెస్ట్ సీజన్ 2 నిర్వహించనున్నట్లు డాక్టర్ మంజుల సాగంటి ప్రకటించారు. ఈ అద్భుత కార్యక్రమంలో 100 మందికి పైగా చిన్నారులు ఒకే జెయింట్ కాన్వాస్‌పై తమ సృజనాత్మకతతో చిత్రాలను గీయనున్నారని తెలిపారు. చిన్నారుల్లోని కళా ప్రతిభను వెలికితీసేందుకు ఈ భారీ వేదికను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ లోగోను ఆవిష్కరించి, చీఫ్ అడ్జుడికేటర్ డాక్టర్ మంజుల సాగంటిని,సంస్థ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలోని ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలు, ఆర్ట్ ఫెస్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తులో మరెన్నో రికార్డులు నమోదు చేయాలని ఆకాంక్షించారు.



అత్యవసర సేవల్లో అప్రమత్తతే ముఖ్యం

ప్రజాపక్షం/గూడూరు: అత్యవసర సమయాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా గూడూరు మండల కేంద్రంలోని 108 అంబులెన్సులను మంగళవారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్ జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ అంబులెన్సులను పరిశీలించి అందులోని వైద్య పరికరాలు మందుల నిల్వలుత సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంబులెన్సుల్లో అవసరమైన మందులు వైద్య సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర సహాయం కోసం ప్రజల నుంచి ఫోన్ కాల్ అందిన వెంటనే స్పందించి ఎలాంటి జాప్యం లేకుండా సంఘానా స్థలానికి చేరుకోవాలని తెలిపారు. రోగులకు సకాలంలో ప్రాథమిక వైద్య సహాయం అందిస్తూ సమీప ఆస్పత్రులకు తరలించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. గూడూరు ఏజెన్సీ ప్రాంతం కావడంతో మారుమూల గ్రామాల ప్రజలకు 108 సేవలు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందని అధికారులు సూచించారు నిరంతరం ఉందని అధికారులు సూచించారు.నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి అత్యవసర కాల్‌కు ప్రాధాన్యతనిచ్చి సేవలందించాలని తెలిపారు ఈతనిఖీల్లో ఈఎంటీలు హనుమంతు సుప్రియ అంబులెన్స్ పైలెట్లు ప్రశాంత్ నాగరాజు పాల్గొన్నారు.



నేడు గూడూరులో నూతన పెన్షన్ పంపిణీ

ప్రజాపక్షం/గూడూరు: చేయూత పథకం ద్వారా నూతనంగా పెన్షన్ మంజూరైన లబ్ధిదారులకు బుధవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. గూడూరు మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని అర్హులైన అబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేయనున్నారు.కొత్తగా పెన్షన్లు మంజూరు కావడంతో అర్హులైన అబ్ధిదారుల్లో అనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరువ కావడంలో భాగంగా చేపడుతున్న ఈకార్యక్రమానికి సంబంధిత గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులు అధికారులు హాజరుకానున్నారు. ఈసంతర్భంగా నూతనంగా పెన్షన్ మంజూరైన వారంతా నిర్ణీత సమయానికి కార్యక్రమానికి చేరుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టీవీఎల్ఎన్ శాస్త్రీ కోరారు. ప్రజాప్రతినిధులు అధికారులు అబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాని విజ్ఞప్తి చేశారు,

గార్ల మండలంలో ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాపక్షం/గార్ల: మండలంలో నాటుసారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఎక్సై.వ సీఐ రాంప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మంగళవారం మండలంలోని అంజనాపురం,పెద్దకిష్టాపురం గ్రామాలలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎక్సైంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంజనాపురం,పెద్దక్రిష్టాపురం గ్రామాలలో నిర్వహించిన దాడులలో గుగులోత్ శాంతి అనే మహిళ నాటుసారాతో పట్టుబడింది.ఆమే వద్ద నుండి 4లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని,నిందితురాలిపై కేసు నమోదు చేశారు. అనంతరనం ఆమేను గార్ల తహశీల్దార్ ఎదుట హజరుపరచి బైండోవర్ చేశారు. అంజనాపురం గ్రామంలో నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన సుమారు 800లీటర్ల బెల్లం పానకాన్ని అధికారులు గుర్తించి అక్కడికక్కడే పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ సందర్భంగా ఎక్సైజ్ సిఐ రాంప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా సరే నాటుసారా తయారు చేసినా, అమ్మినా లేదా రవాణా చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.నాటుసారా తయారీ,విక్రయాలకు సంబందించిన సమాచారం ఏమైనా తెలిస్తే ప్రజలు వెంటనే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ దాడులలో ఎస్సై శ్రీనివాస్,కారిస్టేబుల నాగరాజు,విజయ్,జాన్ పాషా,గోపి తదితరులు పాల్గొన్నారు.



నేడు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళా

ప్రజాపక్షం/జనగామ టౌన్: జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల కోసం నవంబర్ 18న ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించనున్నట్లు ఆహార భద్రత అధికారి నీహెచ్ వినీల్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఐడీఓసీ కార్యాలయం రూమ్ నంబర్ జీ2లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేళా జరుగుతుందని పేర్కొన్నారు. వ్యాపారులు కొత్త లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు పొందడంతోపాటు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 92479 26664 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన నూతన విఒ భవనం

ప్రజాపక్షం/తాడ్వాయి: నార్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్బాక గ్రామంలో మహిళా సంఘం వీవో భవనం నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రరంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల వ తేదీన నూతన భవనాన్ని ప్రారంభించేందుకు సంబందిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. మహిళా సంఘాల సమావేశాలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, సంఘాల నిర్వహణకు సొంత భవనం అందుబాటులోకి రానుండటంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి చేతుల మీదుగా నూతన పింఛన్ పత్రాల అందజేత

ప్రజాపక్షం/తాడ్వాయి: కొత్తగా మంజూరైన ఫించన్ల అనుమతి మంజూరు పత్రాలు మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి ఆర్థిక భరోసా కృషి చేస్తుందని ఆన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ జాజ విజయచంద్రం, అశోక్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/దేవరుప్పుల: మండలంలోని 31 మంది అర్హులైన లబ్ధిదారులకు ర.31,03,596 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పంపిణి చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అహ్మద్, ఎంపీడీవో మేనక పౌడల్, సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్, నాయకులు ధర్మారెడ్డి, సురేష్‌బాబు, నాగరాజు, సజ్జన్, గణేష్, వెంకన్న, ఉమేష్, ప్రకాశ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కెటాయించాలి

ప్రజాపక్షం/కొడకండ్ల: ఇందిరమ్మ ఇళ్ల రెండో విడుత లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు చోటు కల్పిస్తున్నారని బీఎస్పీ మండల అధ్యక్షుడు ఏల్పుగొండ కుమారస్వామి ఆరోపించారు. ఈ మేరకు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయితీ తీర్మాణం లేకుండానే ఇష్టానుసారంగా లబ్ధిదారుల పేర్లు ఎంపిక చేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిజమైన అర్హులకు ఇళ్లు కెటాయించాలని, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడెల్లి మహేందర్, నాగేష్, వంశి, నవీన్, పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.

యూత్ నాయకుని తండ్రిని పరామర్శించిన జిల్లా అధ్యక్షులు

ప్రజాపక్షం/తాడ్వాయి: తాడ్వాయి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు నవీన్ తండ్రి ఇటివల పక్షవాతానికి గురికాగా విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పరామర్శించి వారి అనారోగ్యానికి కారణాలను తెలుసుకున్నారు. వారికి ఏ అవసరం ఉన్న నేనున్నాని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి సర్పంచ్ కొట్టం ప్రవళిక, మండల పార్టీ అధ్యక్షులు దండుగల మల్లయ్య పాల్గొన్నారు.

నిర్వాసితులను నమ్మించి గొంతు కోసిన మాజీ సిఎం కెసిఆర్

ప్రజాపక్షం/గజ్వేల్ : మల్లన్న సాగర్ నిర్వాసితులను నమ్మించి గొంతు కోసిన మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు బాధితుల ఉసురు తగులుతుందని ముంపు ప్రాంతాల కౌన్సిలర్లు ఉపేందర్ రెడ్డి, గుగ్లోతు రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింహా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని మాజీ మంత్రి హరీష్ రావు నమ్మబలికి నట్టేట ముంచినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు గాలికొదిలిన వారు తమ



అనుచరులకు బాధ్యత అప్పగించి దోచి పెట్టినట్లు విమర్శించారు. ముంపు బాధితులకు అండగా ఉంటూ ఆదుకోవాల్సిన బిఆర్ఎస్ నిర్వాసితులతో రాజకీయం చేస్తుందని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన బిఆర్ఎస్ నేతలే ముంపు గ్రామాల ప్రజలను రెచ్చగొడుతూ మరింత జటిలం చేస్తున్నట్లు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డిపై తమకు పూర్తి నమ్మకం ఉందని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా ఆయనకే ఉందని చెప్పారు. న్యాయం కోసం ఆవేదన చెందుతున్న తమతో రాజకీయం చేయొద్దని, ముంపు గ్రామాల సమస్యల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు సమీర్, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రమోద్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, నేతలు జహంగీర్, షకీల్, కొమ్ము ఉమేష్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

257 పెన్షన్ ఉత్తర్వుల పంపిణీ

ప్రజాపక్షం/నిజాంపేట : గత ప్రభుత్వ పదేళ్ల కాలం లో అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్ లో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని, మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సూచించారు. నిజాంపేటలోని రేణుక గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన సమావేశం లో లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. 8 మండలాలకు సంబంధించి వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కు సంబంధించి 3,983 చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకట్, నాయకులు నజీరుద్దీన్, మ్యాదరి నర్సింలు, మద్దికుంట శ్రీనివాస్, లింగం గౌడ్, వడ్ల యాదగిరి, ఎంపీడీవో ముజాహిద్దీన్, ఆయా గ్రామాల సర్పంచులు ఉన్నారు.



రీ సర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం



ప్రజాపక్షం/నిజాంపేట : భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని, మెదక్ ఆర్డిఓ రమాదేవి సూచించారు. నిజాంపేట మండలం నందిగామ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వేను తహశీల్దార్ శ్రీనివాస్ తో కలిసి సందర్శించారు. కొన్ని సంవత్సరాలుగా ఉన్న భూ సమస్యలకు భూ రీ సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు సర్వే సమయంలో అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు.

సహకార సంఘం పునరుద్ధరణపై హర్షం

ప్రజాపక్షం/శివ్వంపేట : మండలంలోని గోమారం గ్రామంలో కొనసాగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని రైతుల కోరిక మేరకు పునరుద్ధరించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఏఎంసి మాజీ వైస్ ఛైర్మన్ మాధవరెడ్డి అన్నారు. గతంలో 1987లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంగా మారగా 2006లో రద్దయింది. అప్పటి నుంచి రైతులు ఎదురుచూస్తున్న సంఘం తిరిగి ప్రారంభం కావడంతో వ్యవసాయంపైఆధారపడిన రైతులకు ప్రయోజనం కలుగనుందని అన్నారు. ఇందుకు సహకరించిన మంత్రులు దామోదర రాజనర్సింహా, వివేక్ వెంకటస్వామి, నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నర్సింహారెడ్డి, సర్పంచ్ హైమావతిఆంజనేయులు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లినే కడతేర్చిన కసాయి కొడుకు



ప్రజాపక్షం / పెద్ద శంకరంపేట : డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం కన్నతల్లి ప్రాణాలను బలిగొంది. పెద్ద శంకరంపేట మండలం శివాయపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం చిలక ముక్కు పాపయ్య తన తల్లి పద్మమ్మతో గొడవపడి, రోకలి బండతో ఆమె తలపై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకున్న పద్మమ్మను 108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి అక్క కుమారుడు చిలకముక్కు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

విశ్వక్ నందన్‌కు పద్మాదేవేందర్‌రెడ్డి ఆశీస్సులు

ప్రజాపక్షం/పాపన్నపేట : పాపన్నపేట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుర్ర కిష్టగౌడ్ మనువడు విశ్వక్ నందన్ తొలి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాపన్నపేట మండలంలోని గాంధారిపల్లి రోడ్డులో ఉన్న ఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన ఈ వేడుకలకు మాజీ ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లా నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మండల నాయకులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి విశ్వక్ నందన్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు



విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ సురేష్, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలాగౌడ్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, బద్రి మల్లేశం, మాజీ ఎంపీటీసీ కుబేరుడు, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, నాయకులు ఏడుపాయల శ్రీనివాస్ గౌడ్, మాణిక్యరెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు

ప్రజాపక్షం / కొల్చారం : ఆదిశక్తి పరాశక్తి శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే భక్తులందరికీ సకల శుభాలు కలుగుతాయని పాల్వంచ సురేఖ కృష్ణ గౌడ్ దంపతులు అన్నారు. మంగళవారం కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొల్చారం గ్రామానికి చెందిన పాల్వంచ సురేఖ కృష్ణ గౌడ్, దంపతులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దంపతులు అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, రామా గౌడ్, సత్య నారాయణ గౌడ్, కృష్ణ గౌడ్ (కిట్టు), మౌనిక, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



కొత్త పింఛన్లతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం



ప్రజాపక్షం/మనోహరాబాద్: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన చేయూత పింఛన్లతో పర్కిబండ, తుపాకులపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది. మనోహరాబాద్ మండలంలోని పర్కిబండ గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఠాకూర్ మోతిభాయి లక్ష్మణ్ సింగ్, ఉప సర్పంచ్ నిమ్మల మహేష్ లు పాలకవర్గ సభ్యులతో కలిసి నూతనంగా పింఛన్లు మంజూరైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పూల జ్యోతి రమేష్, పెగడ నరహరి, సంజీవని భాస్కర్ గౌడ్,నిమ్మల మౌనిక మల్లేష్, రేషన్ డీలర్ ఎల్లంకి మధుసూధన్ గౌడ్, మాజీ సర్పంచ్ బుర్ర కైతయ్య, మంచి సాయికుమార్, నవీన్, యాదగిరి, గణేష్, సంతోష్ రెడ్డి, నగేష్, మధు, వెంకటేష్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/మనోహరాబాద్ : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఆంజనేయులు సూచించారు. మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం సర్పంచ్ నూకల రాము అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తహశీల్దార్ ఆంజనేయులు ఎల్‌నినో ప్రభావం, దాని పరిణామాలపై గ్రామస్థులకు వివరించారు.ఈ ప్రభావం పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థులకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు ముందస్తు అప్రమత్తతపై అవగాహన కల్పించడమే గ్రామసభ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుంటే సిద్దిపేట సభను అడ్డుకుంటాం

ప్రజాపక్షం/గజ్వేల్ : నిర్వాసితులకు ఇచ్చిన హామీలు వెంటనే పరిష్కరించకుంటే సిఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట సభను అడ్డుకుంటామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్ లోని కెసిఆర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లు నిర్మించగా, నిర్వాసితులకు ఇచ్చిన హామీలను దాదాపుగా పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. అయితే ముంపు గ్రామాల కు చెందిన 350 మంది బాధితులకు ఇండ్లు, ఇంటి స్థలాలు, ఇతర ప్యాకేజీలు మిగిలి పోయినట్లు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నిర్వాసితులకు మద్దతుగా అప్పటి ప్రతిపక్ష నేత, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటిగడ్డ కిష్టాపూర్ లో 48 గంటల దీక్ష చేపట్టగా, అప్పుడు ఇచ్చిన హామీలు సిఎంగా నెరవేర్చే బాధ్యత రేవంత్ రెడ్డిపై ఉందని అన్నారు. అలాగే సిద్దిపేట జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొనగా, జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గజ్వేల్



అభివృద్ధి కోసం అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ రూ 180 కోట్లను వివిధ పెండింగ్ పనులకు మంజూరి చేయగా, రాష్ట్రంలో అధికారం చేపట్టిన సిఎం రేవంత్ రెడ్డి వాటిని రద్దు చేసినట్లు విమర్శించారు. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కుండ పోచమ్మ సాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రద్దు చేసిన నిధులు, సమస్యలను పరిష్కరించని పక్షంలో సిఎం రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని, సిద్దిపేటలో అడుగుపెట్టనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు నవాజ్ మీరా, కౌన్సిలర్ కోట బాబు, నేతలు రాములు, ఎల్లం, మల్లేశం, కనకయ్య, నర్సింహా రెడ్డి, నాగరాజు, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

ప్రజాపక్షం/పాపన్నపేట : పరిస్థితులకు అనుగుణంగా నీటి లభ్యతను బట్టి రైతులు పంటలు సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట మండల పరిధిలోని నర్సింగ్ సర్పంచ్ డి.మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావం తక్కువగా నమోదు కావడంతో సాగునీటి కొరత తప్పదన్నారు. రైతులు నీటి లభ్యత బట్టి ఆరుతడి పంటలైన కూరగాయలు, సూనె గింజలు లాంటివి సాగు చేసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవడం వల్ల పంట నష్టం జరగకుండా రైతుకు లాభం చేకూరుతుందన్నారు. గతంలో శాస్త్రవేత్తల ద్వారా ప్రతీ గ్రామంలో జిల్లా వ్యాప్తంగా ఆరుతడి పంటలు, చీడపీడల నివారణ, ఎల్నినో ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. దీర్ఘ కాలిక ఆదాయం పొందే అవకాశం ఉన్న ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఉద్యానవన శాఖల అధికారుల సలహాలు తీసుకొని పండ్ల తోటలు సాగు చేస్తే తక్కువ నీటితో అధిక లాభాలు ఆర్జించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ యాదయ్య, తహసీల్దార్ సతీష్, ఏవో శ్రీనివాస రాజు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాటిపల్లి నీటి ఎదుటపై గ్రామసభలు



ప్రజాపక్షం/రేగోడు: మండల కేంద్రంలోని నీటి ఎదుట ఉంది అని నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇంటికి ఒక ఇంకుడు గుంత ఏర్పర చుకోవాలని వి బి జి రాంజీ పథకం ద్వారా నిర్మించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు మంగళవారం రేగోడు మండలంలోని సిందోల్, తాటిపల్లి, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి పనులకు జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వందరోజుల పని కల్పిస్తున్నామని జగదీష్ అన్నారు . తాగునీటి సమస్య ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఖదీర్ తెలిపారు. బోరు బావుల కింద వరి సాగు చేయొద్దని వాటి స్థానంలో జొన్న మొక్కజొన్న పప్పు దినుసుల పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచులు రవికుమార్, కవిత ప్రవీణ్, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతవుతున్న వరి కోయలు

ప్రజాపక్షం/అల్లాదుర్గం : మండలంలో వరికోతలు పూర్తయిన పొలాలన్నీ నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. రైతులు తదుపరి పంట వేసేందుకు తొందరపడి వరిగడ్డిని, కొయ్యలను పొలంలోనే తగులబెడుతుండడంతో పుడమి తల్లి అగ్నికి ఆహుతవుతోంది. దీంతో భూసారం క్రమంగా క్షీణించి, పర్యావరణం కలుషితమవుతోంది.

ఒకసారి కాల్చిన భూమి తిరిగి సారవంతం కావడానికి ఎన్నో ఏళ్లు పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గడ్డి కాలుతున్నప్పుడు వెలువడే కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్ వాయువులు గాలిని విషతుల్యం చేస్తున్నాయి. దీంతో పొలాల పక్కన నివసించే ప్రజలకు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులకు శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. పక్షులు, జీవులు కూడా ఈ మంటల్లో చిక్కుకుని మాడిపోతున్న దృశ్యాలు కలచివేస్తున్నాయి.

వ్యవసాయ అధికారి వివరణ

ఈ విషయంపై వ్యవసాయ అధికారి నెలవంక మాట్లాడుతూ, రైతులు తాత్కాలిక లాభం కోసం వరికోయ్యలు కాల్చడం మానుకోవాలి. రోటవేటర్, స్ట్రా చాపర్ వంటి యంత్రాలతో వాటిని భూమిలోనే కలియదున్నితే అద్భుతమైన సేంద్రియ ఎరువుగా మారుతుంది. దీనివల్ల భూమి బలం పెరిగి, రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. పుడమి తల్లిని కాపాడుకోవడం మనందరి



బాధ్యత అని సూచించారు. ప్రతి ఏటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదన్నారు. వరి కోయలు కాల్చడం వల్ల రైతుకే నష్టం రైతులందరూ అది కాయలు కాల్చకుండా కలయ దున్నుకోవాలని తెలిపారు. రైతులకు యంత్రాలపై సబ్సిడీ, సకాలంలో అందుబాటులో ఉంచితేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలని మున్సిపల్ కమీషనర్‌కి పిర్యాదు



ప్రజాపక్షం/సంగారెడ్డి : సంగారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని మంజీరా నగర్‌లో బైపాస్ రోడ్డు కు ఆనుకొని అబ్కారి కార్యాలయం ముందు ఉన్నలేఆవుట్ నెంబర్లు 2/97, 368/87 లోని 80 ఫీట్ల రోడ్డు ఖాళీ స్థలం లో స్థానికులు రాత్రికి రాత్రే నిర్మాణం చేపట్టి వ్యాపార షటర్‌లు వేసినరాని అట్టి అక్రమ నిర్మాణం తొలగించాలని మున్సిపల్ కమీషనర్ కి పిర్యాదు చేసిన సామాజిక కార్యకర్తలు శ్రీదర్ మహేంద్ర డి త్రివిక్రమ రావు ,కృష్ణ చారి తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు ఖాళీ స్థలాలు ,పార్క్ స్థలాలు,రాజకీయ నాయకులు ప్రతి నిదులు అండంతో జరుగుతున్నాయని, అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కి పిర్యాదు చేస్తామని తెలిపారు.

దాచారంలో చేయూత మంజూరు పత్రాలందజేత..

ప్రజాపక్షం/బెజ్జంకి : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుతం పని చేస్తుందని సర్పంచ్ బైర మానస రాజేందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దాచారం గ్రామంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీటి బాల్‌నర్సు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామ సభ

ప్రజాపక్షం / నిజాంపేట : మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఓకే సామాజిక తనిఖీ భాగంగా నిజాంపేట మండలంలో వివిజి రామ్ జి చట్టంలో పనిచేసిన కూలి వేతనాలు గ్రామంలో చేపట్టిన మెటీరియల్ కంపోనెంట్ కింద అలాగే సిసి డ్రైనేజీ రోడ్లలో భాగంగా గ్రామంలో మొత్తం 15 లక్షల 36000 రూపాయలు ఖర్చుకాగ అందుకు సంబంధించిన కూలి వేతనాలు పోను 14 లక్షల రూపాయలు ఖర్చు కావడం జరిగింది. 35 వేల రూపాయలు మెటీరియల్ కంపోనెంట్‌కు ఖర్చు చేశారు. మిగిలిన రూపాయలు నర్సరీకి సంబంధించి ఖర్చు చేసినట్లుగా గ్రామసభలో రిపోర్టు చదివి వినిపించడం జరిగింది. తనిఖీల భాగంగా గుర్తించిన అంశాలను గ్రామసభలో వెల్లడిస్తూ మొత్తం గ్రామంలో 681 పింఛన్ ఉండగా పింఛన్లు కూడా తనిఖీలో భాగంగా లబ్ధిదారుల ఇళ్లల్లోకి వెళ్లి పింఛన్‌లు అందుతున్న లబ్ధిదారుల వివరా



లను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఉపాధి హామీ పనులకు గాను వివిజి రామ్ జి గ్రామీణ చట్టం క్రింద ఒక కుటుంబానికి ఒకే జాబ్ కార్డుకు 100 రోజుల పని కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించాలని గ్రామ సభలో ఎస్ఆర్‌పి కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజమ్మ లక్ష్మి గౌడ్, ఉపసర్పంచ్ దేవ రాజ్, వార్డు మెంబర్ రహీం, రేణుక, గ్రామ కార్యదర్శి మమత, డిఆర్‌పిటి ఏ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్తి రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించాలి

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై దృష్టి సారించాలని ఉమ్మడి మెదక్ ఎంపి మాధవనేని రఘు నందన్‌రావు సూచించారు. రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వాడకం క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం జగదేవ్‌పూర్‌లోని రామాంజనేయ, శ్రీనివాస కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులను అనుసరించి భూసారాన్ని కాపాడుకునే విధంగా యవ్యవసాయం చేయాలని సూచించారు. అధిక ధిగుబడుల కోసం విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా అవసరమైన మేరకే వాడాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులకు మద్దతు ధరతో పాటు గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు పక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాతావరణ మార్పుల కారణంగా



పంటల సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,నీటి లభ్యత,నేల స్వభావాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నందున నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటన్ కార్పొరేషన్ జిల్లా అధికారి ప్రకాశ్, కార్యదర్శి ఉష, బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, గొల్లపల్లి సర్పంచ్ మహేష్, పత్తి మిల్లు నిర్వాహకులు జూలకంటి ప్రభాకర్, బిజెపి నాయకులు, కప్పార ప్రసాద్‌రావు, ఎల్లురాంరెడి, బాల్‌కిషన్, బుద్ద మహేందర్,మహిళ నాయకురాలు మంజే నర్సమ్మ, అజీత్‌రెడ్డి,రాములు, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల సభలో పొలిటికల్ రచ్చ !



ప్రజాపక్షం/చేర్యాల: సిద్దిపేట జిల్లా చేర్యాల రేనుక గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం రాజకీయ రగడకు వేదికైంది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి రాకతో ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ప్రసంగిస్తున్న సమయంలో కూడ ఇరు పార్టీల కార్యకర్తల ఆదేతీరును కొనసాగించడం వాగ్యాదం ముదరడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. పరిస్థితి సద్దుమణగకపోవడంతో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతున్న మధ్యలోనే గొడవ జరుగుతుండడంతో సభనుంచి వెళ్లిపోయారు. కాగా, అర్హులైన ప్రతి ఒక్కరుకీ పింఛన్లు అందేలా పోరాడతానని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు 4వేల పింఛన్ అమలు చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేవారు. అనంతరం అధికారులు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసే ఏర్పట్లు చేశారు.

ఇంటింటా సౌభాగ్యం కాదు... దార్యిదం నింపిన కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాపక్షం/గజ్వేల్ : ఇంటింటి సౌభాగ్యం కంటే దారిద్రమే ఎక్కువగా ఉందని, ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా కాంగ్రెస్ నెరవేర్చకుండా ప్రజాపాలన పేరుతో మభ్యపెడుతూ మోసం చేస్తున్నట్లు ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 9వేల కోట్లలో కొడంగల్ ను అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోని నియోజకవర్గాలను సీఎం రేవంత్ రెడ్డి విస్మరిస్తున్నట్లు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మేనిఫస్టోను చింపి చెత్తబుట్టలో వేసినట్లు గుర్తు చేశారు. జిల్లా అభివృద్ధి కోసం సమస్యలతో అర్జీలు ఇస్తే నేటికీ ఒక సమస్య కూడా తీరలేదని, పట్టణ శివారులో ఉన్న కిలోమీటర్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయలేదని, మూడు కోట్లతో నిర్మిస్తున్న ప్రజ్ఞాపూర్ బస్టాండ్ పనులు అసంపూర్తి దశలో ఉన్నట్లు తెలిపారు. అభివృద్ధిలో కొడంగల్ కుడి కన్ను అయితే, దుబ్బాక ఎడమ వైపు కన్ను పెట్టి అభివృద్ధి చేయాలని కోరితే కళ్ళు మూసుకుని సీఎం రేవంత్ రెడ్డి పరిపాలిస్తున్నట్లు విమర్శించారు. జిల్లా ప్రజల తలాపున మల్లన్న సాగర్ ఉన్నప్పటికీ చుక్కనీరు ఇవ్వలేదని, యాదాద్రి భువనగిరి జిల్లాను మోసం చేశారని, హైదరాబాద్ నడిబొడ్డులో నిర్మిస్తున్న స్కైవాక్ మాట జాడలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నేతలు రాంరెడ్డి, ప్రసాద్ రావు, సురేష్, మనోహర్ యాదవ్ పాల్గొన్నారు.

టిఆర్ఎస్ చీఫ్ కవితను విమర్శించే నైతిక హక్కు ప్రతాప్ రెడ్డికి లేదు



ప్రజాపక్షం/గజ్వేల్ : పార్టీలు మారే వంటేరు ప్రతాప్ రెడ్డి టిఆర్ఎస్ చీఫ్ కవితను విమర్శించడం సిగ్గుచేటని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ విమర్శించారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతాప్ రెడ్డి చరిత్ర గజ్వేల్ ప్రజలకు తెలుసని, రూ.కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలని నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే సంజీవరావును మచ్చిక చేసుకొని పథకాలు పక్కదారి పట్టించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడుసార్లు పోటీ చేసిన ఆయన దివాలా తీయాల్సింది పోయి మరి కోట్లు ఎలా కూడబెట్టినట్లని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీష్ రావు అక్రమాలను కవిత బహిర్గతం చేస్తే ప్రతాప్ రెడ్డికి వచ్చిన ఇబ్బంది ఏమిటని అన్నారు. ఆయన ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ భూస్థాపితం అవుతుందని చెప్పారు. మరోసారి కవితను విమర్శిస్తే ఊరుకునేది లేదని బహిరంగంగా ఆమెకు క్షమాపణ చెప్పాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎడ్ల నర్సింలు, నేతలు కూరాకుల శ్రీకాంత్, లింగని రాజు, పాష, లక్ష్మణ్, మిస్బా తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట అభివృద్ధిని చూసి నేర్చుకోండి, ఆగిన పనులు ప్రారంభించండి

* ప్రేమతో ప్రజల మనసు గెలవాలి.. దండయాత్ర, బుల్డోజర్ కాదు..
* మల్కాజిగిరి ఓటమితో మైనంపల్లి ఫ్రస్టేషన్...
* బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, పాల సాయిరాం

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: కెసిఆర్ పదేండ్ల పాలనలో సిద్దిపేట అన్ని రకాలుగా వినూత్న కార్యక్రమాలతో అధ్యయన కేంద్రంగా నిలిచిందని,సిఎం హోదాలో మీరు,మీ మంత్రులు,ఎంఎల్ఏలు అంతా సిద్దిపేట అభివృద్ధి పనులను చూసి అదేవిధంగా మీ మూడేండ్లలో ప్రభుత్వ వివక్షతో ఆగిన పనులను చూసి,అభివృద్ధి పనులను ప్రారంభించాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వేణుగోపాల్ రెడ్డి,సాయిరాంలు సూచించారు. మంగళవారం సిద్దిపేట ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దండయాత్ర.. మైసం



పల్లి బుల్డోజర్ లాంటి అభ్యంతర వ్యాఖ్యలు సరికాదని,ప్రేమతో సిద్దిపేటకు రావాలని,పరుష పదాలతో కాదని,సిద్దిపేట ప్రజలు చైతన్యం గలవారని,తెలంగాణ ఉద్యమ సమయంలో సిద్దిపేట పోరాట పటిమ యావత్తు చూసిందని తెలిపారు. సిద్దిపేట పట్ల కాంగ్రెస్ నాయకులు భాష మార్చుకోవాలని,రేవంత్ రెడ్డి దండయాత్ర కాదు,సిద్దిపేటలో ఆగిన పనుల గూర్చి మాట్లాడు... 3 ఏండ్లుగా ఒక్క పని జరగలేదన్నారు. సిఎం హోదాలో రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లే హక్కులు ఉన్నాయని,కానీ ప్రేమతో సిద్దిపేటరా మనసులో అక్కసుతో రావొద్దని,బెదిరింపు ధోరణి సరికాదన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని,సిద్దిపేట ఆత్మ గౌరవం దెబ్బతీసే దండయాత్రలు వద్దు,మా సిద్దిపేట అభివృద్ధికి నిధులు కావాలన్నారు. మల్కాజిగిరిలో ఓటమి ఫ్రస్టేషన్‌లో మైనంపల్లి హనుమంతారావు ఉన్నాడని, కాంగ్రెస్ పార్టీలో ఐక్యమత్యం లేదని ఆయనే నిన్న ఆవేదన వ్యక్తంచేశారని,బుల్డోజర్ పదం బిజెపి అని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం పోరాడి సాధించుకున్నాం, ఎవరి దయతో రాలేదన్నారు. 1070 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని,మాజీ మంత్రి హరీష్ రావు మీద రాజకీయ కక్ష్య ఉంటే ప్రజల మీద చూపించవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ముత్యాల కనకయ్య,పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతిక్ అహ్మద్, దరిపల్లి శ్రీనివాస్,రెడ్డి యాదగిరి,శ్రీనివాస్,నవీన్,పెర్క మధు,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు...

నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి : సమాజంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడం నాణ్యమైన విద్య మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సామాజిక భద్రత కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేయూత ఫించన్లను మంజూరు చేస్తోందని తెలిపారు. సోమవారం సంగారెడ్డి ఎక్స్ రోడ్ లోని పీఎస్ గార్డెన్స్‌లో నిర్వహించిన సంగారెడ్డి నియోజకవర్గ స్థాయి నూతన చేయూత పింఛన్ల మంజూరి పత్రాల పంపిణి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు ,జిల్లా కలెక్టర్ జైన్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగారెడ్డి, సదాశివపేట



మున్సిపాలిటీలతో పాటు కంది, కొండాపూర్, సదాశివపేట ,సంగారెడ్డి మండలాలకు చెందిన నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 4.50 లక్షల చేయూత పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 18,591 నూతన పింఛన్లు మంజూరు కాగా సంగారెడ్డి నియోజవర్గంలో 3,917 మందికి పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. వృద్దులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత చేనేత కార్మికులకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు గౌరవప్రదమైన జీవనానికి అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో ఈనెల 19 వ తేదిన పింఛన్ నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి వైద్య కళాశాలలకు 18 పిజీ సీట్లు మంజూరయ్యాయని సంగారెడ్డి, అందోల్, ప్రాంతాల్లో నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని ప్రజలకు అవసరమైన వైద్య చికిత్సల్లో 90 శాతం వరకు జిల్లా పరిధిలోనే అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏ ఒక్క పౌరుడు వైద్య సామాజిక భద్రత విషయంలో భద్రత విషయంలో అభద్రతకు గురికాకుండా అవసరమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకంపై అధికారులకు శిక్షణ

ప్రజాపక్షం/జనగామ టౌన్: ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం అమలులో భాగంగా దరఖాస్తుల నమోదు, కుటుంబ సభ్యుల వివరాలు, నామినీల ఎంపిక, ఆధార్ కైవైసీ ప్రక్రియపై మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులకు షశిక్షణ నిర్వహించారు. మైనర్ నామినీలు ఉంటే గార్డియన్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఆధార్, డ్రువీకరణ, బయోమెట్రిక్, దరాఖాస్తుల స్కానింగ్, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియపై ఈడీఎం గౌతమ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎంపీడీవోలు, తహశిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో అభిరామ్‌కి స్వర్ణ పతకం

ప్రజాపక్షం/బచ్చన్నపేట: కాకినాడలో నిర్వహించిన 5వ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే పోటీలు 2026లో కొడవటూర్ గ్రామానికి చెందిన గూడ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు అభిరామ్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించాడు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న క్రీడాకారులతో పోటీపడి ఈ ఘనత సాధించాడు. దీంతో గ్రామంలో అభిరామ్‌పై అభినందనలు వెల్లువెత్తాయి. తన కుమారుడి విజయం ఎంతో గర్వంగా ఉందని తండ్రి శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

918 మంది అర్హులకు చేయూత పింఛన్

ప్రజాపక్షం/పాపన్నపేట : అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. పింఛన్ అంటే కేవలం నెలనెలా అందే ఆర్థిక సాయం మాత్రమే కాదని, వృద్ధులకు జీవన భరోసా.. దివ్యాంగులకు అండ.. నిరుపేద కుటుంబాలకు కొండంత ధైర్యమని పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట మండల కేంద్రం లోని మంజీరా గార్డెన్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై 918 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఆర్థికంగావెనుకబడినవారు, వృద్ధులు, దివ్యాంగులు గౌరవ ప్రదంగాజీవించేందుకు సామాజిక భద్రత ఎంతో అవసరమన్నారు. వయోభారంతో పనిచేసే శక్తి తగ్గినవారికి, ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొంటున్న నిరుపేదలకు పింఛన్ ఎంతో ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. పింఛన్ రూపంలో అందే ఆర్థిక చేయూత లబ్ధిదారుల నిత్యావసరాలకు ఉపయోగపడటమే కాకుండా వారు ఆత్మ గౌరవంతో జీవించేందుకు భరోసానిస్తుందని అన్నారు. అర్హులెవరూ సంక్షేమ ఫలాలకు



దూరంకాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ గౌడ్, స్థానిక సర్పంచ్ పావని గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశం, జిల్లా సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షులు శ్రీధర్, సర్పంచులు నగేష్, రజిత రాజశేఖర్, భాగ్య ఎల్లప్ప, శ్రీనివాస్, పద్మ రమేష్, విజయ దుర్గ నాని, యాదగిరి, శేఖర్, యేసు, సిద్దిరాంరెడ్డి, శ్రీశైలం, సిద్దప్ప, నాయకులు గోవింద్ నాయక్, గౌస్, కిష్టయ్య, సత్యనారాయణ, భూమయ్య, అంబయ్య, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీశైలం, తహసీల్దార్ సతీష్, వివిధ గ్రామాల కార్యదర్శులు, లబద్ధిదారులు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కాపాడుకుందాం

ప్రజాపక్షం/సంగారెడ్డి : భవన్ నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటియుసి ఆద్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయుసి జిల్లా అధ్యక్షా కార్యదర్శి ఎం ఏ.రెహెమాన్, బి. వెంకట్రాజ్యం , సంయుక్తంగా మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తూ ఉంది . కోట్ల రూపాయాల ఐటిసీ సెంటర్ల నిర్మాణం కోసం రక్తపరీక్షల కోసం సిహెచ్చి హెల్త్ కేర్ సెంటర్ వారికి ఖర్చు చేస్తున్నారు. సహాజ మరణం ప్రమాద మరణాలు, ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారు. జులై 2026 వరకు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీ ను కాకుండా నేరుగా లేబర్ డిపార్ట్మెంట్‌కే ఇన్సూరెన్స్ కంపినీ ద్వారా ఇన్సూరెన్స్ బాధ్యతను అప్ప జేప్పాలి , 50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ. 5వేలు పెన్షన్ ఇవ్వాలి. సిఎస్పీహెల్త్ టెస్టులు రద్దు చేయాలి. సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిద్యం కల్పించాలి. ప్రమాద మరణ క్లేంలను 15 లక్షలు పెంచాలి. అని కోరుతూ ఏఐటియుసి డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఓ ఎం శివ శంకర్, అధ్యక్షరాలు, లక్ష్మి , గద్దల కావ్య, చంటి శోభ, గొల్ల మల్లేశ్వరి, అరుణ, శ్రీలత, సంగీత, స్వరూప, లావణ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనలో రిటైర్డు పెన్షనర్లు బకాయిల సాధనకు నల్లజెండాలతో నిరసన చేపట్టాలి

* ఇప్పటికే రిటైర్డు ఉద్యోగులు 283 మంది మృతిచెందిన ప్రభుత్వం స్పందించకపోవటం విచారకరం
* రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి

ప్రజాపక్షం/ సిద్దిపేట : మార్చి 2024 నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పెన్షనరీ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు.

ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులందరూ నల్లజెండాలతో నిరసన తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో



ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవిత కాలంలో పొదుపు చేసుకున్న జీపీఎఫ్, కమ్యూటేషన్ తదితర బకాయిలు సకాలంలో అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే బకాయిలు అందక 283 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. హైకోర్టు ప్రకటించిన 10 శాతం వడ్డీతో సహా బకాయిలను కోర్టుకు వెళ్లిన, వెళ్లని పెన్షనర్లందరికీ ఏకమొత్తంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు జీపీఎఫ్, కమ్యూటేషన్ అందని వారికి వెంటనే చెల్లింపులు జరపాలని, డీఏ బకాయిలను విడతలవారీగా కాకుండా ఒకే బిల్లులో చెల్లించాలని, బకాయిలు అందక మరణించిన రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా, అనేక ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని చంద్రమౌళి విమర్శించారు. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలపై చూపుతున్న శ్రద్ధ, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల న్యాయమైన బకాయిల చెల్లింపుపై కూడా చూపాలని అన్నారు. పెన్షనర్ల సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం స్పందించేలా చేయడమే నల్లజెండాల నిరసన ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి పెన్షనరీ బకాయిలను వడ్డీతో సహా చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోహెడ చంద్రమౌళి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు పొన్నమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఎల్ నినో ప్రభావాలపై జర్నలిస్టుల ర్యాలీ



ప్రజాపక్షం/సంగారెడ్డి : జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని టీయూడబ్ల్యూ జే ఐజేయూ సంగారెడ్డి జిల్లా శాఖ ఆద్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఎల్‌నినో అవగాహన ర్యాలీ విజయవంతంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ఐబి వద్ద జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రారంభించారు. సంగారెడ్డి ఐబి నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో జర్నలిస్టులు, వివిధ రంగాల ప్రముఖులు ,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవసరం లేని సమయంలో విద్యుత్ పరికరాలను నిలిపివేయడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. తమ యూనియన్ ఏడు దశాబ్దాలుగా జర్నలిస్టులు సంక్షేమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. ఇటీవల సంగారెడ్డిలో నిర్వహించిన రక్తదాన శిభిరాన్ని ప్రస్తావించారు. ప్రకృతి వనరుల పరిరక్షణ ప్రతి పౌరుడి బాద్యతగా భావించాలని కోరారు. ముఖ్యంగా రైతులు ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వర్కింగ్ జర్నలిస్టులు ముందుకు రావాడం అభినందనీయమని చెప్పారు. కేవలం వార్తలను రాయడానికే పరిమితం కాకుండా సామాజికంగా కూడా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినందుకు అభినందించారు. డిపి ఆర్ఓ విజయలక్ష్మి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎలాంటి లోపాలకు తావు లేకుండా తుది ఓటరు జాబితా రూపొందించాలి



ప్రజాపక్షం/సంగారెడ్డి : ఏలాంటి తప్పులు లోపాలకు తావు లేకుండా పారదర్శకంగా తుది ఓటరు జాబితా రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నుండి ఈఆర్వోలు , ఏఈ ఆర్ఓలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం ఓటరు జాబితా సవరణకు సంబందించిన అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఎన్‌డిడి (ఆబ్సెంట్, పిప్షెడ్, డెడ్ ,డ్యూప్లికేట్) ఓటర్లకు ఎన్నిక సంఘం మరో అవకాశం కల్పించనందున క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన వారి దరఖాస్తులు ప్రిసెసింగ్‌ను ఈ నెల 21 వ తేదిలోగా పూర్తి చేయాలని పరిశీలనలో అర్హులుగా తేలిన వారిని ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదికారులకు స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంగీత, ఈఆర్ఓలు ,ఏఈఆర్ఓలు ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభత్రకు ప్రాధాన్యమివ్వాలి – ఎమ్మెల్యే

ప్రజాపక్షం/దేవరుప్పుల: విద్యార్థినులు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్గిఉండాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం వెటా, వికీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు శానిటరీ కిట్లు పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలికలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. మహిళా సాధికారతకు బాలికల ఆరోగ్యం, ఆత్మగౌరవం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వెటా చైర్‌పర్సన్ హనుమాండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, వెటా ప్రతినిధులు, వికీస్ ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.